పత్రికా ప్రకటన - 3

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేది: 4.08.2014

తెలంగాణ రాష్ట్రంలో జరుగబోయో తొలి స్వాతంత్ర్య దినోత్సవాన్ని చారిత్రాత్మక గోల్కొండ కోటలోనే నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పునరుద్ఘాటించారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, విద్యా శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, నగర మేయర్ మాజిద్ హుస్సేన్, ప్రభుత్వ సలహాదారు పాపారావు, ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, డిజిపి అనురాగ్ శర్మ, పోలీస్ కమీషనర్ మహేందర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఎంకె.మీనా, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గోల్కొండ కోట, చుట్టు ప్రక్కల ప్రాంతాలను దాదాపు రెండు గంటల పాటు పరిశీలించారు. కోట లోపల బయట కలియ తిరిగి పతాకావిష్కరణకు అనువైన స్థలాన్ని ముఖ్యమంత్రి స్వయంగా ఎంపిక చేశారు. రాణి మహల్ సమీపంలో వున్న తారామతి మజీద్ పై భాగంలో బాలా-ఈ-హిస్సార్ క్రింది భాగంలో పతాకావిష్కరణ చేయాలని నిర్ణయించారు. తారామతి మజీద్ ఎదురుగా వున్న విశాలమైన పచ్చిక బయలులో ఆహ్వానితులను కూర్చొబెట్టాలని సూచించారు. ఈ ప్రాంతము 10 నుండి 12 వేల మంది కూర్చోవడానికి అనువుగా వుంటుందని అధికారులు తేల్చారు. ముఖ్యమంత్రి కేసిఆర్ పతాకావిష్కరణ చేసే చుట్టు ప్రక్కల బురుజులు, ఎత్తైన కట్టడాలపై నుండి తెలంగాణ కళారూపాలు ప్రదర్శించాలని కేసిఆర్ చెప్పారు. ఇందుకోసం అనువైన ప్రదేశాలను కూడా కేసిఆర్ ఎంపిక చేశారు. ఈసారి స్వాతంత్ర్య దినోత్సవము పూర్తిగా కోట లోపలి ప్రాంతములోనే నిర్వహించనున్నారు. పోలీస్ గౌరవ వందనం కూడా అక్కడే స్వీకరిస్తారు. అయితే పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శన తదితర కార్యక్రమాలు నిర్వహించడానికి మరో విశాల ప్రాంతం కావలసి వుండటంతో కోట ప్రక్కనే వున్న 18 చీడిల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. దానిని పూర్తిగా చదును చేసి 26 జనవరి వరకు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవము, గణతంత్ర్య దినోత్సవాలు, ఇతర స్టేట్ ఫెస్టివల్స్‌ను గోల్కొండ కోటలోనే ఘనంగా నిర్వహించుకునే విధంగా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని గోల్కొండ కోటలో నిర్వహించాలనే నిర్ణయం వెనుక తెలంగాణ చారిత్రక పునర్వికాసానికి కృషి చేయాలనే లక్ష్యం వున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. డిల్లిలోని ఎర్రకోట

తరహాలోనే గోల్కొండ కోట వద్ద 15 ఆగష్టు వేడుకలు జరుగునున్నాయి. ప్రపంచమంతా గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఆసక్తిగా గమనిస్తున్నందున తెలంగాణ చరిత్ర, సంస్కృతి ప్రతిబింభించేలా ఉత్సవం జరుగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

ముఖ్యమంత్రి గోల్కొండ కోటకు స్వయంగా వచ్చి స్థల పరిశీలన కోసం ఎత్తు ప్రాంతాలు ఎక్కి దిగడం, కాలినడకన కలియ తిరగడం, గోల్కొండ కోట సందర్శకులకు, చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన స్థానికులకు ఆశ్చర్యానుభూతి కలిగించింది. గోల్కొండ కోటలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించడం పట్ల మేయర్ మాజిద్ హుస్సేన్ సంతోషం వ్యక్తం చేసి పుష్పగుచ్చం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలోని అన్ని వర్గాలు ఐకమత్యంగా చారిత్రక, సాంస్కృతిక పునరుజ్జీవణానికి సహకరించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

---

**సిపిఆర్ఒ టు సిఎం**